వైభవంగా లక్ష్మీనరసింహుడి తిరుకల్యాణం

స్వామివారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 22: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపి అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవసేవ జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 27 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ. 43,75,437 ఆదాయం సమకూరిందని అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

ఆలయ ఉద్యోగిపై వేటు..

యాదగిరిగుట్ట దేవస్థాన సూపరింటెండెంట్ సత్యనారాయణ శర్మను సస్పెండ్ చేస్తున్నట్లు ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. లీగల్ అండ్ లీజెస్ విభాగంలో పర్యవేక్షణ విధులు నిర్వర్తిస్తూ అధికారులకు ముందస్తు అనుమతులు, సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు అవుతున్నారు. దాంతో కార్యాలయ ఫైల్స్ నిర్వహణ, కోర్టుకు సంబంధించిన కేసుల విషయంలో తీవ్ర ఆటంకం కలుగుతున్నది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన ఈఓ ఆ విభాగం సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. గతంలో పలు మార్లు సత్యనారాయణ శర్మ సస్పెన్షన్‌కు గురైనట్లు సమాచారం.

పోచంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీశ్రీనివాస్

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

భూదాన్‌పోచంపల్లి, జూన్ 22 : పోచంపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని, అందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మీశ్రీనివాస్ కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. 13 వార్డుల్లో నీటి సరఫరా నిర్వహణ కోసం రూ.22 లక్షలు, డ్రైనేజీ నిర్మాణాల కోసం రూ.12 లక్షలు, హరితహారం కార్యక్రమం కోసం నర్సరీ నిర్వహణకు రూ. 5లక్షలు కేటాయించడంతో పాటు పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో వివిధ పనులు చేపట్టేందుకు కౌన్సిల్ సభ్యులు తీర్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. హరితహారంలో అందరూ భాగస్వాములు కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు కొంగరి కృష్ణ, పెద్దల చక్రపాణి, కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, భోగ భానుమతి, మోటి రజిత, దేవరాయ కుమార్, కో-ఆప్షన్ సభ్యులు జల్లి నరసింహ, మేనేజర్ శ్రీనివాస్ స్వామి, ఏఈ శ్రీరాములు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- ఎంపీపీ రచ్చ కల్పన

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కల్పన

మోత్కూరు, జూన్ 22: ప్రత్యేకాధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ రచ్చ కల్పనాలక్ష్మీనర్సింహారెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అంతకు ముందు వివిధ శాఖల అధికారులు తమ పరిధిలో జరిగిన పనులను సభ ముందు ఉంచారు. అనంతరం పదవీవిరమణ పొందుతున్న ఎంపీడీఓ మనోహర్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గోరుపల్లి శారద, వైస్ ఎంపీపీ బుషిపాక లక్ష్మి, ఎఫ్‌ఎస్‌సీఎస్ చైర్మన్ పేలపుడి వెంకటేశ్వర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాడి రైతుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి బాలరాజుగౌడ్

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూన్ 22 : పాడి రైతుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ హనుమంతు కె. జెండగేకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్ మాట్లాడుతూ ఆరు నెలలుగా బిల్లులు రాక సహకార పాడి పరిశ్రమను నమ్ముకొని జీవనం సాగిస్తున్న వేలాది మంది పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బిల్లులు రాక పశు పోషణ కూడా కష్టంగా మారిందన్నారు. పెండింగ్ పాల బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు కోయగూర మల్లికార్జున్, ఎల్లంల వెంకటేశం, నరాల చంద్రయ్య, చిక్కుళ్ల పాండు, రాసాల రాజు, మచ్చ భాస్కర్, రాసాల నవీన్, కోయకూర కర్ణాకర్, పూస రాములు, స్వామి, నోముల రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలి : బీఆర్‌ఎస్వీ

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు సంతోష్

ఆలేరురూరల్, జూన్ 22 : ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులు నియంత్రించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు పరిదె సంతోష్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రాఘవాపురంలో విలేకరులతో మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పేరిట తల్లిదండ్రుల నుంచి వేల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. అయినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు గుర్రాల రమేశ్, కరికె మల్లేశ్, బండ జహంగీర్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాలివ్వాలి

- డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్

బీబీనగర్, జూన్ 22 : పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్ కోరారు. బీబీనగర్ మండలంలోని ముగ్దుంపల్లిలో శనివారం యువజన సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అనేక పరిశ్రమలు ఉన్నాయని, వాటిలో స్థానికంగా ఉన్న యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా బీహార్, మధ్యప్రదేశ్, ఒడిశా, బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల వారిని తీసుకుంటున్నారని అన్నారు. ఉద్యోగాలు లేక జిల్లా యువత హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. పరిశ్రమల్లో ఏదైనా ప్రమాదం జరిగినా బయటికి రాకుండా లోలోపల కుటుంబ సభ్యులతో కుమ్మక్కై వ్యవహారాలు నడిపిస్తున్నారని ఆరోపించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు బండారు శ్రవణ్, స్థానిక యువకులు భరత్, డప్పు బాలకృష్ణ, భార్గవ్, పెరుమండ్ల శివ, సమీర, పాల్గొన్నారు.

పెండింగ్ ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

ధరణి పోర్టల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భువనగిరి కలెక్టరేట్, జూన్ 22 : ధరణి పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ దరఖాస్తులను పరిశీలించి వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ పి. బెన్‌షాలోమ్ ఆదేశించారు. శనివారం తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ధరణి రికార్డుల వివరాలను, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌లో జరుగుతున్న జాప్యాన్ని తాసీల్దార్ అంజిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సీసీఎల్‌ఏ నుంచి సాంకేతిక కారణం వల్ల పీఓబీకి సంబంధించిన మాడ్యూల్ అప్లోడ్ కాకపోవడంతో గ్రామానికి సంబంధించిన మొత్తం పీఓబీ భూముల వివరాలు డిస్‌ప్లే అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య నెలకొందని, సత్వరమే సమస్య పరిష్కారం అయ్యే వీలుందన్నారు. భువనగిరి తాసీల్దార్ కార్యాలయం పరిధిలో మొత్తం 400 దరఖాస్తులకు గానూ సగానికి పైగా పరిష్కారం చేసి ఉన్నతాధికారుల లాగిన్‌కు అప్లోడ్ చేసినట్లు తాసీల్దార్ అంజిరెడ్డి వివరించారు. ఆయన వెంట డీటీ కళ్యాణ్, సిబ్బంది ఉన్నారు.

పూర్ణగిరిలో అన్నదానం

భువనగిరి కలెక్టరేట్, జూన్ 22 : మండలంలోని నమాత్‌పల్లి గ్రామం స్వయంభూ పూర్ణగిరి సుదర్శన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కడారి వీరమల్లు విజయలక్ష్మి, ఆనందుశ్రీలత, సత్యనారాయణమహేశ్వరి సహకారంతో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యురాలు కంబాలపల్లి మంగమ్మ, ఆలయ సిబ్బంది బత్తిని వెంకటేశ్‌గౌడ్, ఆలయ పూజారి పవన్‌కుమార్ శర్మ, ఉపాసకుడు బత్తిని రాములు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లక్ష్మీ పుష్కరిణి వద్ద పేకాడున్న వారిపై కేసు

యాదగిరిగుట్ట, జూన్ 22: కొండకింద లక్ష్మీపుష్కరిణి వద్ద పేకాడుతున్న వ్యక్తులను ఎస్పీఎఫ్ సిబ్బంది శనివారం అదుపులోకి తీసుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన వరంగల్ జిల్లాలోని పరకాలకు చెందిన గజరాల రాజు, సిరలేని కృష్ణ, హన్మకొండకు చెందిన కురాకుల శ్రీను, రంగారెడ్డి జిల్లా కొత్తూరు గ్రామానికి చెందిన సంగూడం సుమన్ పేకాడుతుండగా గమనించిన ఎస్పీఎఫ్ సిబ్బంది వారిని అదుపులోకి తీసుకొని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి

భువనగిరి కలెక్టరేట్, జూన్ 22 : గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు బొల్లపల్లి స్వామి, కార్యదర్శి కుంసోత్ శంకర్, గడుగు నర్సింహ కోరారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని శనివారం మండలంలోని అనాజిపురంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షురాలు గునుగుంట్ల కల్పనాశ్రీనివాస్‌గౌడ్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం పారిశుద్ధ్య సిబ్బందికి కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

భక్త మార్కండేయ ఆలయానికి విరాళాలు

రాజాపేట, జూన్ 22 : మండల కేంద్రంలోని భక్త మార్కండేయ ఆలయ పునఃనిర్మాణం కోసం శనివారం పలువురు దాతలు విరాళం అందించినట్లు ఆలయ చైర్మన్ ఆడేపు లక్ష్మీనారాయణ తెలిపారు. రాజాపేటకు చెందిన వేముల సురేశ్ రూ.1.11 లక్షలు, సకినాల నారాయణ రూ.1.11 లక్షలు, ఎక్కలదేవి రమేశ్ రూ.1.11 లక్షలు, మాజీ ఉపసర్పంచ్ బేజుగం రాజేశ్వర్ రూ. 8వేలు, డాక్టర్ నర్సింగరావు రూ. 51 వేలు, బత్తిని మార్కండేయులు రూ. 51 వేలు, కుందారపు పోచయ్య రూ. 31 వేలు, భోగ చక్రపాణి కుమారులు రూ.31 వేలు, డాక్టర్ బొడ్డు కృష్ణ రూ. 21 వేలు, పొట్టబత్తిని నర్సింహులు రూ. 21 వేల విరాళం అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆడేపు శ్రీశైలం, నాయకులు చుంచు నారాయణ, ఆడేపు గణేశ్, ఉపేందర్, పొట్టబత్తిని వెంకటేశం పాల్గొన్నారు.

నర్సాపురానికి బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

రాజాపేట, జూన్ 22 : మండలంలోని నర్సాపురం విద్యార్థులు పాఠశాలకు వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ శనివారం యాదగిరిగుట్ట డీఎం శ్రీనివాస్ గౌడ్‌కు గ్రామ మాజీ సర్పంచ్ నాగిర్తి గోపిరెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. ప్రస్తుతం బస్సులేక ప్రజలు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. బస్సు సౌకర్యం కల్పిస్తామని డీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు యమ్మ భాస్కర్ ఉన్నారు.

సమగ్రంగా మిషన్ భగీరథ వివరాలు సేకరించాలి

ఆత్మకూరు(ఎం), జూన్22 : మిషన్ భగీరథ ఇంటింటి సర్వేను చేపట్టి నివేదికను అందివ్వాలని ఎంపీడీఓ నిరంజన్‌వలీ తెలిపారు. మండల కేంద్రంలో చేపట్టిన ఇంటింటి సర్వేను శనివారం ఆయన పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది ప్రతి ఇంటిని సర్వే చేపట్టి నీటి సరఫరాపై సమగ్ర నివేదిక అందివ్వాలని సూచించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే

భూదాన్‌పోచంపల్లి/భువనగిరి అర్బన్ , జూన్ 22 : రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతులందరికీ ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని మంత్రిమండలి నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు శనివారం పోచంపల్లి, భువనగిరి పట్టణ కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులకు సంబంధించిన రూ. 31 వేల కోట్ల రుణమాఫీని రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో చేయడం గొప్ప విషయమన్నారు. ఈ ప్రాంతంలో పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వల ఆధునీకరణకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీపీ నరాల నిర్మాలా వెంకటస్వామి, మున్సిపల్ చైర్మన్ పి.వెంకటేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, డీసీసీ ఉపాధ్యక్షుడు రాఘవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, ప్రకాశ్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్

మాట్లాడుతున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కృష్ణన్

భూదాన్‌పోచంపల్లి, జూన్ 22 : ఉపాధిహామీ పథకం పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023-24 సంవత్సరాల్లో చేపట్టిన పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులు, కూలీలకు చెల్లించాల్సిన వేతనాలపై సమీక్ష నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు నిర్వహించిన తనిఖీలో వెలుగు చూసిన విషయాలపై వివరించి అభిప్రాయాలను సేకరించారు. సామాజిక తనిఖీ బృందం వెల్లడించిన పలు విషయాలపై సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లను ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఏపీడీ శ్యామల, విజిలెన్స్ సహాయ అధికారి చండీరాణి, అంబుడ్స్‌మెన్ వీరమల్లు, ఏవీఎం ఆదిత్య, ఏపీఓ కృష్ణమూర్తి, ఎంపీఓ మజీద్, పీఆర్ ఏఈ వెంకటేశ్, సోషల్ ఎడిట్ ఎస్‌ఆర్పీ రమేశ్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, సోషల్ ఆడిట్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల అధికారి నుంచి ధ్రువపత్రాలు అందుకున్న విజేతలు

ముగిసిన పోచంపల్లి బ్యాంక్ ఎన్నికలు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 22 : పట్టణ కేంద్రంలోని పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలకవర్గ ఎన్నికలు హోరాహోరీగా జరిగాయి. 9 డైరెక్టర్ల స్థానాల కోసం 27 మంది బరిలో నిలిచారు. స్థానిక కృష్ణవేణి హైస్కూల్లో శుక్రవారం మధ్యాహ్నం వరకు పోలింగ్ కొనసాగింది. అనంతరం 3 గంటల నుంచి రాత్రి 2 గంటల వరకు కౌంటింగ్ నిర్వహించారు. మొత్తం 1794 ఓట్లు పోల్‌కాగా, అందులో 141 ఓట్లు చెల్లలేదు. ఎన్నికల కౌంటింగ్ ప్రారంభం కాగానే రౌండ్ల వారీగా అభ్యర్థుల మెజార్టీలు మారుతుండడంతో చివరి వరకు ఉత్కంఠ నెలకొంది. విజేతల్లో తడక రమేశ్ 1,194ఓట్లు, కర్నాటి వెంకట బాలసుబ్రమణ్యం 810, ఏలె హరిశంకర్ 711, సురపల్లి రమేశ్ 680, భారత రాజేంద్ర ప్రసాద్ 682, రాపోలు వేణు 670, కొండముడుగు ఎల్లస్వామి(ఎస్సీ రిజర్వ్ స్థానం) 1,113, గుండు కావ్య(మహిళా స్థానం) 1,136, కర్నాటి భార్గవి 952 ఓట్లతో విజయం సాధించారు. వారికి ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్ ధ్రువపత్రాలు అందజేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

విద్యార్థులకు పుస్తకాలను అందిస్తున్న దాతలు

రాజాపేట, జూన్ 22 : మండలంలోని రఘునాథపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పాఠశాల స్థల దాత సంగిశెట్టి శంభయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు విద్యార్థులకు నోటు బుక్స్‌తో పాటు ఇతర వస్తు సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మనోజ్‌కుమార్, సంగిశెట్టి రవికుమార్, గడ్డమీది పద్మ, సంగిశెట్టి విశ్వనాథం, స్వప్న, ఉపాధ్యాయులు బింగి భాస్కర్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసచారి, నవీన్‌కుమార్, అరుణకుమారి, నవమి, నీరద, నాగలక్ష్మి, బాలభవాని, శోభ పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. రైతుల హర్షం


మొలకెత్తిన పత్తి చేనులో కలుపు తొలగిస్తున్న కూలీలు

ఆత్మకూరు(ఎం), జూన్22 : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కురిసిన మోస్తరు వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షంతో రైతులు మెట్ట భూముల్లో పత్తి విత్తనాలను వేశారు. దాంతో విత్తనాలు మొలకెత్తాయి. శనివారం కురిసిన వర్షంతో సంతోషం వ్యక్తం చేసిన రైతులు పత్తి చేనులో కలుపు మొక్కలు తొలగించడంలో నిమగ్నమయ్యారు.

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేములవీరేశం, లక్ష్మారెడ్డి

భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

రామన్నపేట, జూన్22: భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఎంపీపీ పూసబాలమణి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిట్యాల –భువనగిరి రోడ్డు విస్తరణకు, రామన్నపేట దవాఖాన అభివృద్ధితో పాటు డాక్టర్లు, సిబ్బంది నియామకానికి తన వంతు సహకారం అందిస్తానన్నారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే విజన్‌గా అధికారులు పని చేయాలన్నారు. తల్లి తండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై భరోసా కల్పిస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. త్వరలోనే పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం పలువురు ఎంపీటీసీలు తమ ప్రాంత సమస్యలను సభలో ప్రస్తావించారు. చిట్యాల– భువనగిరి ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, లూజ్‌లైన్‌లను సరి చేయాలని, మిషన్ భగీరథ నీటిని అందించాలని కోరారు. అనంతరం ఎంపీపీ పూస బాలమణి, జడ్పీటీసీ పున్న లక్ష్మీజగన్ మోహన్, సింగిల్‌విండో చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, వైస్‌ఎంపీపీ నాగటి ఉపేందర్‌ను ఎంపీ, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి సన్మానించారు. సమావేశంలో ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, వేమవరపు సుధీర్, బడుగు రమేశ్, గోగు పద్మ, ఏనుగు పుష్ప, తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ , వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎంపీ, ఎమ్మెల్యేకు వినతులు

రామన్నపేట : ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డికి స్థానిక ప్రజలు వినతులు అందించారు. రామన్నపేటలో అన్ని రైళ్లు ఆగేలా చూడాలని జడ్పీటీసీ విన్నవించారు. ప్రభుత్వ దవాఖానలో కొత్త భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని ఎంపీపీ, షాదిఖాన అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దీన్, చిట్యాల– భువనగిరి రోడ్డును నాలుగు లేన్లుగా మార్చాలని సీపీఎం నాయకులు, సమస్యలు పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికులు వినతిపత్రాలు అందించారు.

వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరురూరల్, జూన్ 22 : వానకాలం సీజన్ ప్రారంభమైనందున వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి తగిన సూచనలు అందించాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సూచించారు. శనివారం ఆలేరులోని క్యాంపు కార్యాలయంలో వానకాలం పంటల సాగుపై నియోజకవర్గ స్థాయి వ్యవసాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలాల వారీగా పంటల విస్తీర్ణం, సాగుకు అనుకూలమైన పంటల వివరాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు రైతులకు తగిన సూచనలు అందించాలన్నారు. నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనూరాధ, ఏడీఏ వెంకటేశ్వర్‌రావు, ఏఓలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దుదాం

మనందరం కలిసి డగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దుదామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. శనివారం ఆలేరు పట్టణంలోని వీఆర్ కళాశాలలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ


అయిలయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

గుండాల, జూన్ 22 : మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గవ్వల అయిలయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ శనివారం గ్రామానికి వెళ్లి అయిలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన మతీన్ ప్రమాదానికి గురి కాగా పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మందడి రామకృష్ణారెడ్డి, గడ్డమీది పాండరి, బడక మల్లయ్య, పురుగుల మల్లేశ్, బండారి శ్రీనివాస్, పాయిలి శ్రీనివాస్, వట్టిపల్లి రాజయ్య, మందుల మల్లయ్య, కొండపల్లి మెగులాల్, రంజిత్‌రెడ్డి, మహోదయ్ ఉన్నారు.

వారసులకు ఆస్తులు రాసిస్తే అంతే సంగతులు

- టాస్కా జిల్లా అధ్యక్షుడు శెట్టి బాలయ్య యాదవ్

సమావేశంలో మాట్లాడుతున్న శెట్టి బాలయ్య యాదవ్

యాదగిరిగుట్ట, జూన్22 : వారసులకు తమ స్థిర, చరాస్తులు తొందరపడి ధారాదత్తం చేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు, నిరాదరణకు గురయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్(టాస్కా) జిల్లా అధ్యక్షుడు శెట్టి బాలయ్య యాదవ్ వయోవృద్ధులను హెచ్చరించారు. వయో వృద్ధుల సంక్షేమానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందని, సంఘ సభ్యత్వంతో పాటు ప్రభుత్వపరంగా గుర్తింపు కార్డులు వృద్ధులకు అందజేస్తామని తెలిపారు. యాదగిరి గుట్ట పట్టణంలోని తులసీ కాటేజీ యాదగిరిగుట్ట దేవస్థాన విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం టాస్కా బృందంతో చర్చలు జరిపారు. టాస్కాలో చేరేందుకు తమ విశ్రాంతి ఉద్యోగులు సుముఖంగా ఉన్నారని సంఘం నాయకులు ఊడెపు నర్సింహారావు, శేషాచారి, యాదయ్య తదితరులు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అతిత్వరలో పూర్తిస్థాయి ఎన్నికలు టాస్కాకు నిర్వహించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. చర్చలు జరిపిన వారిలో జిల్లా టాస్కా ప్రధాన కార్యదర్శి వెంకటేశం, మండల అధ్యక్ష, కార్యదర్శులు దీకొండ జోగయ్య, రాగి సహదేవ్‌తో పాటు పలువురు సీనియర్లు నర్సింహారెడ్డి, జగన్మోహాచార్య తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బావులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పాండు

అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

భువనగిరి అర్బన్, జూన్ 22: బొగ్గు బావులను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వ కుట్ర చేస్తున్నదని, దానిని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ అధికారం చేపట్టిన తర్వాత దేశ వ్యాప్తంగా 67 బొగ్గు గనులను ప్రైవేటు పరం చేయడం సిగ్గు చేటన్నారు. సహజ వనరులు ప్రజలకు చెందాల్సి ఉండగా.. ప్రైవేటు వారికి అప్పగించడం సరికాదన్నారు. నిత్యం దేశభక్తి గురించి మాట్లాడే బీజేపీ నాయకులు దేశ సహజ వనరులను అమ్ముతూ దేశాన్ని కొల్లగొడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, సహాయ కార్యదర్శులు మాయ కృష్ణ, బోడ ఉదయభాగ్య, ఈర్లపల్లి ముత్యాలు, నాయకులు సిలువేరు ఎల్లయ్య, పాలడుగు రవి, రాంబాబు, వరుణ్ పాల్గొన్నారు.